జీతాల్లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

- మూడు నెలలుగా వేతనాలు రాక వేదన
- సూర్యాపేట వైద్యశాల డాటా ఎంట్రీ ఆపరేటర్ వసీం అక్తర్ ఖాన్ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకొని మృతి
- వసీం ఆత్మహత్యకు బాధ్యులెవరు : కేటీఆర్ నిలదీత

వసీం మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్/సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 18 : మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించే దారిలేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన వసీం అక్తర్ ఖాన్ (43) అదే గ్రామానికి చెందిన ఫౌజియా బేగం అలియాస్ రజినీని 15 ఏండ్ల కింద మతాంతర వివాహం చేసుకున్నాడు. నాలుగేండ్లుగా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఫౌజియా బేగం కూడా ఇదే వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. సూర్యాపేట ఇందిమ్మకాలనీ ఫేజ్- 1లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. మూడు నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించక పోవడంతో భార్యాభర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక పోవడంతో తినడానికి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసీం శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయాడు. ప్రస్తుతం సూర్యాపేట జనరల్ వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని మార్చేందుకు అధికారులు ప్రయత్నించినా కోర్టుకు వెళ్లి మరో ఏడాది పాటు కొనసాగేలా ఉత్తర్వులు తెచ్చుకున్నట్టు తెలిసింది. మూడు నెలలుగా వేతనాలు రాక పోవడం వల్ల మనోవేదనతోనే వసీం ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు చెప్తున్నారు. భార్య ఫౌజియా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

'డియర్ రజినీ నన్ను క్షమించు..'

ఆత్మహత్యకు ముందు వసీమ్ తన భార్యకు లేఖ రాసి గదిలో పెట్టాడు. 'డియర్ రజనీ.. నన్ను క్షమించు.. నిన్ను ఎంతో బాధపెట్టాను. ఏదో సాధించాలనుకున్నా కానీ సాధ్యం కాలేదు' అని లేఖలో పేర్కొన్నాడు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనరల్ హాస్పిటల్‌లో వసీమ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి : కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

వసీం ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సర్వేల్ గ్రామానికి వెళ్లి వసీం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు అందిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నదని, వాస్తవ పరిస్థితులు అలా లేవని, సమయానికి వేతనాలు రాక చిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసీం కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ కేవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాంబాబు యాదవ్, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల కన్వీనర్ నర్రి నరసింహ ఉన్నారు.

ఈ పాపం ఎవరిది?

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సూసైడ్‌పై కేటీఆర్ ఆవేదన
- మూడు నెలలుగా జీతమివ్వకపోవడంపై ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసీం ఆత్మహత్యకు బాధ్యులెవరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో వసీం ఆర్థిక ఇబ్బందుల పాలై మనస్తాపంతో ఉరేసుకొని చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆదివారం ఎక్స్‌వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. వసీంకు ముగ్గురు ఆడపిల్లలున్నారని, వారికి ఆరోగ్యం సరిగా లేక అవస్థలు పడుతున్నారని, ఇందుకు కారణం సర్కార్ కాదా? అని నిలదీశారు. పిల్లలను కనీసం దవాఖానలో చూపిద్దామంటే చిల్లిగవ్వ లేని దుస్థితి వల్లే వసీం ఆత్మహత్యకు పాల్పడ్డాడని కేటీఆర్ పేర్కొన్నారు. వసీం భార్య కూడా అదే వైద్యశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అని, ఒకటో తారీఖునే జీతాలిస్తున్నామని పేర్కొనే సర్కార్ డొల్లతనానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు.

కౌలు రైతు ఆత్మహత్య

- పంటలు పండక.. అప్పులు తీరక బలవన్మరణం
- హనుమకొండ జిల్లాలో విషాదం

అనిల్‌కుమార్ (ఫైల్)

వేలేరు, ఆగస్టు 18: పంటలు పండక, అప్పుల తీరక మనస్తాపంతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. వేలేరు మండలం శాలపల్లికి చెందిన దామెర అనిల్ కుమార్ (31) గ్రామంలో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలు సరిగ్గా పండక సుమారు రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. 3 నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఏడాదిపాటు విశ్రాంతి తీసుకున్నాడు. దీంతో అప్పు సుమారు 6.50 లక్షలకు పెరిగింది. వీటిని ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గురయ్యాడు. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి వెనుకాల పడి ఉండగా గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'రాఖీ'కి సాధారణ సెలవునివ్వండి: టీఎస్‌జీహెచ్ఎం

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): బాలికలు, ఆడబిడ్డలు ఘనంగా జరుపుకునే రాఖీపండుగను ఐచ్ఛిక సెలవుగా కాకుండా సాధారణ సెలవుగా ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్ఎం) ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ సెలవుల ఉత్తర్వుల్లో ఐచ్ఛిక సెలవు స్థానంలో సాధారణ సెలవుగా మార్చాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రాజభాను, ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాశ్, ఆర్ రాజుగంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లోని బాలికలు, మహిళా ఉపాధ్యాయులకు సెలవులివ్వాల్సి ఉందని విజ్ఞప్తిచేశారు.

రాష్ట్రంలో మరో ఐదు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో ఐదురోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కర్ణాటకను ఆనుకొని తెలంగాణ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలతో పాటు, నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం నుంచి పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలో 556.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 59శాతం అధికం. గత 24 గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో 5.54 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణకేంద్రం తెలిపింది.

జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతున్న టీ ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

- 36 డిమాండ్లపై ఉద్యమానికి సిద్ధం
- టీఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్

జగిత్యాల, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని టీ ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవోస్ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ స్పష్టంచేశారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, నగదురహిత వైద్య సేవలు, 317 జీవో రద్దు, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో జేఏసీ కోశాధికారి షాహిద్ బాబు, సహ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, టీ పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్, టీజీవో నాయకులు కందుకూరి రవిబాబు ఉన్నారు.

వేతనాలివ్వలేం.. ఓపిక పట్టండి!

- 2008 డీఎస్సీ ఉద్యోగాలపై ప్రభుత్వం నాన్చుడు
- జీతాలివ్వలేక నియమించడం లేదన్న ఓ మంత్రి
- ఆరునెలలైనా అమలుకాని క్యాబి నెట్ నిర్ణయం
- ఆందోళనలో 1,500 మందికి పైగా అభ్యర్థులు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్టు' ఉన్నది 2008 డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి. వీరికి ఉద్యోగాలివ్వాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా, కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలిస్తామని మంత్రి మండలి నిర్ణయం తీసుకున్నా అమలుకాక వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితేం బాగాలేదు. ఇప్పుడు మిమ్మల్ని ఉద్యోగాల్లోకి తీసుకుంటే వెంటనే జీతాలు ఇవ్వాల్సి వస్తుంది. కాస్త ఓపికపట్టండి' ఇవి 2008 డీఎస్సీ అభ్యర్థులతో ఓ మంత్రి అన్న మాటలు. ఉద్యోగాలు ఇవ్వాలని ఆరునెలల కిందటే క్యాబినెట్ నిర్ణయయించింది. త్వరలో మీ నియామకాలు జరుగుతాయని క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులూ చెప్తున్నారు. ఈ నెల 27లోగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని స్వయంగా అడ్వకేట్ జనరల్ హైకోర్టు ధర్మాసనం వద్ద మాట ఇచ్చారు. ఈ నేపథ్యంలో తమకు ఉద్యోగాలు వచ్చినట్టేనని భావిస్తున్న ఆ అభ్యర్థులు ఆ మంత్రి మాటతో ఇప్పుడు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. హైకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు.. డీఎస్సీ 2008 అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఫిబ్రవరి 24న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ డీఎస్సీ 2008 బాధితులకు ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు ప్రచారం చేసింది. అధికారులు వివరాలు సేకరించగా దాదాపు 1,500 మంది వరకు ఉన్నట్టు తేలింది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి ఉద్యోగాల్లో చేరుతారని భావించారు.

క్యాబినెట్ సబ్ కమిటీ పేరుతో కాలయాపన

డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చే అంశంపై ప్రభుత్వం విధివిధానాల రూపకల్పన బాధ్యతను మంత్రి దామోదర రాజనర్సింహా నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగిస్తూ మార్చి 14న ఉత్తర్వులు జారీచేసింది. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. అప్పటి నుంచి అభ్యర్థులు మంత్రుల చుట్టూ, విద్యాశాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అదిగో, ఇదిగో అంటూ తిప్పుకుంటున్నారే తప్ప ప్రక్రియను పూర్తి చేయడం లేదు. ఈ కేసుపై ఈ నెల 8న హైకోర్టులో జరిగిన వాదనల సందర్భంగా మూడు వారాల్లోగా నియామకాలు పూర్తి చేస్తామని 'చివరి అవకాశం' ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ కోరడంతో.. ధర్మాసనం ఈ నెల 27వ తేదీకి విచారణను వాయిదా వేసింది.

సర్కారుపై ఆర్టీసీ కార్మికుల జంగ్‌సైరన్

- ఈ నెల 27న నల్లబ్యాడ్జీలతో నిరసన
- సెప్టెంబర్ 10న 'డిమాండ్ డే'.. అక్టోబర్ 1న నిరాహార దీక్ష
- ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రసర్కారుపై ఆర్టీసీ కార్మికులు జంగ్‌సైరన్ మోగించారు. పెండింగ్ డిమాండ్లపై ప్రభుత్వంతో తేల్చుకునేందుకు ఆర్టీసీ జేఏసీ సిద్ధమవుతున్నది. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న ఆదివారం ప్రకటించారు. ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా 'నల్లబ్యాడ్జీలతో' నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 10న హామీలను అమలు చేయాలని కోరుతూ 'డిమాండ్ డే ' పేరిట నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించనున్నట్టు చెప్పారు. అక్టోబర్ 1న ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో వెంటనే జేఏసీలను ఏర్పాటు చేయాలని వెంకన్న పిలుపునిచ్చారు. టీజీఎస్ఆర్టీసీలో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని ఆర్టీసీ జేఏసీ భావిస్తున్నది. కార్మికులపై రోజురోజుకూ పనిభారం మోపుతూ వేధింపులకు గురి చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జేఏసీ తరపున 40 అంశాలతో కూడిన మెమోరాండాన్ని ప్రభుత్వానికి అందజేశారు. రవాణాశాఖ మంత్రి, ఆర్టీసీ ఎండీ, రవాణాశాఖ కమిషనర్‌ను కలిసి ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ డిమాండ్లను వారి ముందు పెట్టారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నా, పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడుతున్నారు. ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన బాండ్ల బకాయిలు రూ. 200కోట్లు, 2 పీఆర్సీ బకాయిలు, డీఏలు ఇప్పటి వరకు పరిష్కారం కాకపోవడం కార్మికుల్లో అసహనం పెంచుతున్నది.

ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహించాలి

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డుల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటలు మాత్రమే డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 11 గంటలు, డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారని వాపోతున్నారు. డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు ఎలాంటి అదనపు అలవెన్సులు చెల్లించడం లేదని మండిపడుతున్నారు. పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

అల్లుడిని పిలిచి అంతమొందించాడు

పెద్దపల్లి జిల్లాలో దారుణహత్య

జూలపల్లి, ఆగస్టు 18: మద్యం సేవిద్దామని ఇంటికి పిలిచిన మామ.. అల్లుడిని హతమార్చిన ఘటన పెద్దపల్లి జిల్లాలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్‌కి చెందిన జేజేల అశోక్ అలియాస్ చెత్తయ్య (45)కు అదే గ్రామానికి చెందిన జాడి కనకయ్య 20 ఏండ్ల క్రితం కూతురిని ఇచ్చి వివాహం చేశాడు. అశోక్ వ్యవసాయం చేస్తున్నాడు. మామ, అల్లుడికి పదేండ్లుగా గొడవలు ఉన్నాయి. అల్లుడికి తన భార్యతో వివాహేతర సంబంధం ఉన్నదన్న అనుమానంతో చంపేయాలని మామ భావించాడు. మద్యం తాగుదామని అశోక్‌ను ఆదివారం ఇంటికి పిలిచాడు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. ఆ తర్వాత ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా.. కనకయ్య ఇనుప రాడ్, బండరాయితో అశోక్ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అశోక్‌కు భార్య అంజలి, నలుగురు కూతుర్లు ఉన్నారు.

టీజీఎస్పీడీసీఎల్‌లో 2,263 మందికి ప్రమోషన్

- ఎట్టకేలకు ఏడున్నరేండ్లకు వీడిన గ్రహణం
- త్వరలోనే పోస్టింగ్‌లు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో పదోన్నతులకు ఏడున్నరేండ్ల తర్వాత గ్రహణం వీడింది. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఆదివారం ఏకంగా 2,263 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. జూనియర్ లైన్‌మన్ నుంచి సీజీఎం వరకు పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఒకరికి జాయింట్ సెక్రటరీగా ఉద్యోగోన్నతి కల్పించారు. జీఎం నుంచి సీజీఎంలుగా ఇద్దరికి, ఎస్ఏవో నుంచి జీఎంలుగా మరో ఇద్దరికి అవకాశం కల్పించారు. మరో 8 మంది డీఈలకు ఎస్ఈలుగా, 30 మంది ఏడీఈలకు డీఈలుగా, 58 మంది ఏఈ/ఏఈఈలకు ఏడీఈలుగా పదోన్నతులు కల్పించారు. జేఎల్ఎం స్థాయి నుంచి ఏఎల్ఎంలుగా 1650 మందికి ప్రమోషన్ కల్పించారు. అకౌంట్స్ విభాగాల్లో వివిధ క్యాటగిరీల్లో 50 మందికి పదోన్నతులు కల్పించారు. ఆపరేషన్, మెయింటెనెన్స్ (ఓ అండ్ఎం) విభాగంలో మరికొందరికి పదోన్నతులు కల్పించారు. త్వరలోనే బదిలీలను చేపట్టి వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఆయా పోస్టులు ఖాళీ కావడంతో త్వరలోనే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేసేందుకు వీలుపడనున్నది. పదోన్నతుల విషయంలో కొన్నిసంఘాలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, పదోన్నతులు ఎట్టి పరిస్థితుల్లో ఆపొద్దని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈజేఏసీ) ప్రతినిధులు శనివారం సీఎండీ ముషారఫ్‌కు సూచించారు. 2,500 మందికి పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు.

సంఘాల ఆధ్వర్యంలో సంబురాలు

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ పదోన్నతులు కల్పించడంతో విద్యుత్తు ఉద్యోగులు ఆదివారం మింట్ కంపౌండ్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్షీరాభిషేకం చేయడమే కాకుండా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. సంబురాల్లో జేఏసీ కో చైర్మన్ పీ అంజయ్య, కో కన్వీనర్ రామేశ్వరయ్యశెట్టి, సీజీఎంలు మోహన్‌రెడ్డి, కామేశ్, కృష్ణారెడ్డి, టీఈజేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విలీనం వార్తలపై బీఆర్ఎస్ ఆగ్రహం

- ఆర్టీవీ నెట్‌వర్క్‌కు, రవిప్రకాశ్‌కు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు
- అసత్య కథనాలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 5 రోజుల్లో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ తప్పుడు కథనాలను ప్రసారం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆర్‌టీవీ నెట్‌వర్క్, రవిప్రకాశ్‌పై బీఆర్ఎస్ పార్టీ లీగల్ నోటీసులు జారీ చేసింది. పార్టీ, పార్టీ అధినేత కేసీఆర్‌పై, ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలను ప్రచురించినందుకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీని స్థాపించి, 4 కోట్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే రీతిలో ఆర్‌టీవీ అసత్యకథనాలను ప్రసారం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. 2014 నుంచి 2023 దాకా తెలంగాణను కేసీఆర్ దేశానికే దిక్సూచిగా నిలిపారని, ఈ క్రమంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై బీఆర్ఎస్ చేసిన పోరాటాన్ని లీగల్ నోటీసులో ప్రస్తావించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలే ప్రాణప్రదంగా కొనసాగుతున్న బీఆర్ఎస్ పార్టీని, పార్టీ అధినేత కేసీఆర్ ప్రతిష్ఠను ఆర్‌టీవీ దిగజార్చిందని, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ నిరాధారమైన కథనాలను ప్రసారం చేసిందని ధ్వజమెత్తింది. ఆర్‌టీవీ నెట్‌వర్క్, రవిప్రకాశ్ ఐదు రోజుల్లో క్షమాపణ చెప్పి, ఆ నెట్‌వర్క్‌లో ఉన్న తప్పుడు కథనాల లింకులను తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

రేపు నాందేడ్‌లో బీఆర్ఎస్ రాష్ట్రస్థాయి సమావేశం

మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే

ముంబై, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : త్వరలో మహారాష్ట్రలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం నాందేడ్‌లో భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రైతు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మహారాష్ట్రలో బీఆర్ఎస్ సమావేశం నిర్వహించలేదని పేర్కొన్నారు. ఇక ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేసే అంశంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

- ఏసీపీ కార్యాలయంలోనే గొంతు కోసుకున్న బేర
- ఎమ్మెల్యే పీఎస్సార్ ప్రోద్బలంతోనే అక్రమ కేసు పెట్టారని ఆరోపణ
- విచారణ కోసమే పిలిపించాం: ఏసీపీ ప్రకాశ్ వివరణ
- ఉన్నతాధికారులు విచారణ జరపాలి: మాజీ ఎమ్మెల్యే

దవాఖానలో సత్యనారాయణ, ఏసీపీ మధ్య సంభాషణ

మంచిర్యాల ప్రతినిధి (నమస్తే తెలంగాణ)/మంచిర్యాల టౌన్, ఆగస్టు 18: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బీఆర్ఎస్ కౌన్సిలర్‌పై కక్షకట్టారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక నస్పూరు మున్సిపాలిటీలో 21వ వార్డుకు కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న బేర సత్యనారాయణ కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే పోలీసులు ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ ఘటన శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో చోటుచేసుకుంది. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనపై కక్షకట్టి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, గతంలో కూడా కేసులు పెట్టించారని ఆరోపించారు. నస్పూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 14లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో తనకు రెండు ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. ఆ వెంచర్‌లోని మురుగు కాలువను ఆక్రమించారని అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ సతీశ్ అక్కడికి వెళ్లి విచారణ జరిపారని, కాలువ కబ్జాకు గురైందని నిర్ధారించుకున్న కమిషనర్.. మురుగు కాలువలో వేసిన మట్టిని తవ్వించి యథావిధిగా మార్చారని చెప్పారు. ఈ విషయంలో కమిషనర్‌తోపాటు ఫిర్యాదు చేసిన స్థానికులకు, తనకు మాటా మాటా పెరింగిందని, ఈ క్రమంలో కమిషనర్‌ను తాను కులం పేరుతో దూషించినట్టు, విధులకు ఆటంకం కలిగించినట్టు తనపై నస్పూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న తనను పోలీసులు బలవంతంగా మంచిర్యాల ఏసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారని, దీంతో తీవ్ర మనోవేదనకు గురై